# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

teluguprabha.net

-TeluguPrabha

@TeluguPrabhaofficial

TS వైబ్రెంట్ ఎడిషన్ 1 pm

శుక్రవారం 25-8-2023





## సచివాలయానికి గవర్నర్

### కేసీఆర్‌తో పాటు.. నల్లపోచమ్మ ఆలయ పూర్ణాహుతి వేడుకకు..

**హైదరాబాద్, ఆగస్ట్25(తెలుగుప్రభ):**

సచివాలయ (Secretariat) ప్రాంగణంలోని నల్లపోచమ్మ ఆలయ ప్రారంభ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. గవర్నర్ తమిళిసై, ముఖ్యమంత్రి కేసీఆర్ (CM KCR) నల్లపోచమ్మ ఆలయంలో పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు హరీశ్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, పువ్వాడ అజయ్, కొప్పుల ఈశ్వర్, మల్లారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి పాల్గొన్నారు.



### వరంగల్, మణుగూరుల్లో

## భూకంపం

**వరంగల్, ఆగస్ట్25(తెలుగుప్రభ):**

వరంగల్ లో శుక్రవారం తెల్లవారుజామున స్వల్ప భూకంపం సంభవించింది. తెల్లవారుజామున 4 :43 గంటలకు భూమి కంపించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేల్ పై 3.6 గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ తెలియజేసింది. భూ అంతర్భాగంలో 30 కిలోమీటర్ల లోపల కదలికలు సంభవించినట్లు వెల్లడించింది. తెల్లవారుజామున భూమి కంపించడంతో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడి ఇండ్ల నుండి బయటకు పరుగులు తీశారు.

**మణుగూరులో**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరు పట్టణంలో ఒక్కసారి గా భూమి కంపించడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. శుక్రవారం తెల్లవారు జామున 4–40 గంటలకు భూమి స్వల్పంగా కంపించడంతో నిద్రలో ఉన్న ప్రజలు ఉలిక్కిపడి బయటకు పరుగులు తీశారు.గత కొద్ది రోజుల క్రితం కూడా ఇదే విధంగా భూ ప్రకంపనలు రావడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు.తెల్లవారుజాము సమయంలో సింగరేణి అధికారులు బ్లాస్టింగ్ చేయరు. కాబట్టి భూకంపమేనని ప్రజలు భావిస్తున్నారు.అధికారులు మాత్రం ఇంతవరకు ఎలాంటి ప్రకటన చేయలేదు.కొత్తగూడెం, తదితర ప్రాంతాల్లోనూ భూమి స్వల్పంగా కంపించినట్లు స్థానికులు తెలిపారు.

## డొనాల్ ట్రంప్ అరెస్ట్

**అట్లాంటా, ఆగస్ట్25:**



అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ అరెస్టు అయ్యారు. 2020 నాటి అధ్యక్ష ఎన్నికలకు సంబంధించి ఫలితాల్లో జోక్యం, కుట్ర, అక్రమాలు లాంటి డజనుకు పైగా క్రిమినల్ కేసులు నమోదైన నేపథ్యంలో పోలీసుల ముందు ట్రంప్ లొంగిపోయారు.అట్లాంటా ఫుల్టన్ కౌంటీ జైలు వద్ద పోలీసుల ఎదుట ఆయన లొంగిపోయారు. ఇందుకు సంబందించిన మగ్ షాట్ ఫొటోస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.డొనాల్ ట్రంప్ స్వయంగా ఫుల్టన్ కౌంటీ జైలుకు వెళ్లి లొంగిపోవడంతో పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. జైలులో 20 నిమిషాల పాటు గడిపారు. ఆపై రెండు లక్షల డాలర్ల విలువైన బాండ్‌ను సమర్పించి బెయిల్‌పై విడుదల అయ్యారు.ట్రంప్‌పై నమోదైన నాలుగు క్రిమినల్ కేసుల్లో ఇది ఒకటి. ఇలాంటి కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు స్వయంగా పోలీసులు ఎదుట లొంగిపోయినా,దాన్ని అరెస్ట్ కిందే పరిగణిస్తారు, తనపై వచ్చిన ఆరోపణలన్నీ అవాస్తవాలని, తాను ఏతప్పూ చేయలేదని ట్రంప్ పేర్కొన్నారు.

### చంద్రయాన్–3 విజయానికి

## విశ్వం జేజేలు

**న్యూఢిల్లీ, ఆగస్ట్25(తెలుగుప్రభ):**

ప్రపంచంలోనే ఏదేశం సాధించలేని విధంగా చంద్రయాన్–3 ద్వారా భారత్ చంద్రుడిపై దిగడాన్ని పలు దేశాలు కీర్తించాయి. జయహో భారత్ అంటూ జేజేలు పలికాయి. భారత్ శక్తిసామర్థ్యాలపై గతంలో వ్యంగ్యంగా కార్టూన్ వేసిన న్యూయార్క్‌టైమ్స్ పత్రిక ఇది భారత్‌కు గొప్ప విజయమంటూ ప్రస్తుతించింది.వాల్‌స్ట్రీట్ జర్నల్,తదితర సంస్థలు సైతం ఈ విజయాన్ని కీర్తించాయి.





# శ్రావణ శోభ

## తెలుగు రాష్ట్రాల్లో కళకళలాడుతున్న అమ్మవార్ల ఆలయాలు

**విజయవాడ,ఆగస్ట్25(తెలుగుప్రభ):**

**శ్రావణమాసం రెండవ శుక్రవారం కావడంతో రెండు తెలుగురాష్ట్రాల్లో అమ్మవార్ల ఆలయాలు ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి.**

బెజవాడ ఇంద్రకీలాద్రి భక్తులతో కిటకిటలాడుతోంది. అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయ అధికారులు అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు దుర్గమ్మకి 31 రకాల విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో భ్రమరాంబ ఉదయాన్నే భక్తులు రద్దీని పరిశీలించారు. సెప్టెంబరు 8వ తేదీన (నాలుగో శుక్రవారం) ఉచితంగా సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించనున్నారు.శ్రీ మహావిష్ణువు జన్మనక్షత్రం శ్రవణం కావడం వల్ల ఆ పేరుతో ఏర్పడిన శ్రావణమాసం అంటే శ్రీమహావిష్ణువు ధర్మపత్ని లక్ష్మీ దేవికి ఎంతో ప్రీతిపాత్రమైనది. శ్రావణమాసంలో చేసే నోములు, వ్రతాలు, పూజల వల్ల లక్ష్మీ కటాక్షం సిద్ధిస్తుందని భక్తులు విశ్వసిస్తారు.శ్రావణమాసం రెండవ శుక్రవారం నాడు మహిళలు వరలక్ష్మి వ్రతాన్ని ఆచరిస్తారు. శ్రావణమాసంలో మహాలక్ష్మి ని పూజించడం వల్ల పసుపు కుంకాలతో, సౌభాగ్యంతో ఉంటారని భక్తులు అమ్మవారిని కొలుస్తుండటం తెలిసిందే.



### చార్మినార్ భాగ్యలక్ష్మి ని దర్శించుకున్న గవర్నర్

**హైదరాబాద్,ఆగస్ట్15(తెలుగుప్రభ):**

శ్రావణమాసం వరలక్ష్మి వ్రతం రోజు సందర్భంగా రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పాతబస్తీలోని చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. హారతి ఇచ్చారు. అధికారులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. తెలంగాణ, దేశప్రజలకు మంచి జరగాలని అమ్మవారిని వేడుకున్నట్లు గవర్నర్ పేర్కొన్నారు.

**కడియపులంకలో కరెన్సీతో అలంకరణ**

తూర్పుగోదావరి జిల్లా కడియం మండలంలోని కడియపులంకలోని ముసలమ్మతల్లి ఆలయంలోని మహాలక్ష్మి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దాదాపు రూ.13.25 లక్షల విలువగల కరెన్సీ నోట్లతో ఆలయ నిర్వాహకులు అమ్మవారిని అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు.

**భద్రకాళి ఆలయంలో**

వరంగల్‌లోని భద్రకాళి ఆలయంలో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే బారులు తీరిన భక్తులతో క్యూలైన్లు నిండిపోయాయి.

**హైదరాబాద్, ఆగస్ట్25(తెలుగుప్రభ):**

**తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల వేడి ఇప్పటికే మొదలైంది. అందరి కంటే ముందుగానే అభ్యర్థులను ప్రకటించి బీఆర్ఎస్ సంచలనం రేపింది. దీంతో అధికార పార్టీ నేతలు జనాల్లోకి దూసుకెళ్తున్నారు. హ్యాట్రిక్ ప్రభుత్వం ఏర్పాటుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. మరోవైపు.. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల సంఘం సమాయాత్తం అవుతోంది.**




అక్టోబర్ రెండో వారంలో షెడ్యూల్ రిలీజ్ చేసి డిసెంబర్ రెండో వారంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. తెలంగాణతోపాటు మరో నాలుగు రాష్ట్రాలకు ఈసీ ఎన్నికల నోటిఫికేషన్ రిలీజ్ చేసే అవకాశం ఉంది.

తెలంగాణ అసెంబ్లీ గడువు 2024 జనవరి 16 వరకు ఉంది. 2014లో సార్వత్రిక ఎన్నికలతోపాటు ఉమ్మడి రాష్ట్రంలోనే చివరి ఎన్నికలు జరిగాయి. కానీ ఐదేళ్లు పూర్తి కాకుండానే కేసీఆర్ 2018లో ముందస్తు ఎన్నికలకు వెళ్లారు. దీంతో 2018 అక్టోబర్ 6న ఈసీ షెడ్యూల్ విడుదల చేసింది. సరిగ్గా రెండు నెలలకు అంటే డిసెంబర్ 7న పోలింగ్ నిర్వహించారు. ఎమ్మెల్యేలంతా జనవరి 17న అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో జనవరి 16వ తేదీ వరకు ప్రస్తుత అసెంబ్లీ మనుగడ సాగించే అవకాశం ఉంది. తెలంగాణతోపాటు ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మిజోరాం రాష్ట్రాల అసెంబ్లీలకు కూడా ఒకేసారి నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది.

**రాష్ట్రంలో పర్యటన**

ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే ముందు కేంద్ర ఎన్నికల సంఘం రెండు సార్లు రాష్ట్రంలో పర్యటించనుంది. ఎన్నికల సన్నద్ధతను పరిశీలించడానికి ఓసారి.. నామినేషన్ల గడువు ముగిసిన తర్వాత మరోసారి సీఈసీ బృందం రాష్ట్రానికి రానుంది. అక్టోబర్ 4న ఓటర్ల తుది జాబితాను ప్రకటించిన తర్వాత ఏ క్షణమైనా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. దక్షిణాది రాష్ట్రాల్లో ఎన్నికల డబ్బు ప్రభావం ఎక్కువగా ఉంటోంది. తెలంగాణలోనూ డబ్బు ప్రభావం పెరిగిందని మునుగోడు, హుజూరాబాద్ ఉపఎన్నికలను బట్టి చెప్పొచ్చు. ఈ ఉపఎన్నికల్లో పార్టీలు భారీగా డబ్బును పంచాయనే ప్రచారం జరిగింది. దీంతో ఎన్నికల్లో నగదు ప్రభావాన్ని అరికట్టడానికి నిఘాను పెంచనుంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలను సైతం ఎన్నికల సంఘం రంగంలోకి దింపనుంది.



### డీజిల్ లేక.. అంబులెన్సు రాక..

## రోడ్డుపైనే ఆదివాసీ మహిళ ప్రసవం

**నిర్మల్, ఆగస్ట్25 (తెలుగుప్రభ):**

రావాల్సిన అంబులెన్సు రాకపోవడంతో తీవ్ర నొప్పులతో అల్లాడుతున్న ఆదివాసి గర్భిణి రోడ్డుపైనే ప్రసవించింది. ఈ ఘటన నిర్మల్ జిల్లా పెంబి అటవీ ప్రాంతంలోని కడెం నది సమీపంలోని మారుమూల గిరిజన గ్రామమైన తులసిపేటలో చోటుచేసుకుంది.వివరాలిలా ఉన్నాయి.జిల్లా లోని పెంబి మండలం ఆదివాసీ గూడెం తులసిపేటకు చెందిన గంగామణి అనే ఆదివాసీ మహిళకు గురువారం రాత్రి పురిటి నొప్పులు మొదలయ్యాయి. కుటుంబ సభ్యులు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. రాత్రి 10 గంటల సమయంలో అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. రోడ్డు సరిగా లేకపోవడంతో అక్కడికి చేరుకోలేకపోతున్నామని, పస్పుల వంతెన మీదుగా తీసుకువస్తే ఆస్పత్రికి తరలిస్తామని చెప్పారు. గర్భిణి కుటుంబ సభ్యులు ఎడ్లబండిలో అతికష్టమ్మీద కడెంవాగు దాటారు. అయితే వాగు ఒడ్డుకు చేరినా అంబులెన్స్ రాలేదని.. కారణం అడిగితే అంబులెన్స్‌లో డీజిల్ అయిపోయిందని బదులిచ్చారు.

ఈ పరిస్థితిలో గంగామణి మాత్రం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో రోడ్డుపైనే మగబిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవం అనంతరం అక్కడికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది వెంటనే ప్రథమ చికిత్స చేసి పెంబి ప్రాథమిక ఆసుపత్రికి తరలించారు. డీజిల్ లేకపోవడంతో అంబులెన్స్ ఆలస్యంగా రావడంతో ఓ మహిళ నది ఒడ్డున నాలుగు గంటలపాటు రోడ్డుపైనే నరకయాతన అనుభవించింది.

